క్లుప్తంగా

క్విజ్‌లో వడాలి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ముదినేపల్లి రూరల్: ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ముదినేపల్లి మండలం వడాలి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ విద్యార్థులు బోడా సుష్మ, ఏఎస్ఎస్ మణికంఠ నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్ తెలిపారు. వీరిని పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడితో పాటు సీనియర్ ఉపాధ్యాయులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్జీ ప్రకాశరావు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని చినకామనపూడిలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు సర్పంచ్ చిట్టూరు నాంచారయ్య స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిత్యావసర సరుకులు, వంటసామగ్రి పంపిణీ చేశారు. బాధితులంతా రోజువారి కూలీలని, వీరిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని సర్పంచ్ కోరారు. ప్రభుత్వం నుంచి సాయమందజేయడానికి ఇప్పటికే రెవెన్యూ అధికారులను కోరినట్టు చెప్పారు.

యూనిఫాం అందజేత



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం జగనన్న విద్యాకానుకలో భాగంగా యూనిఫాం, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలకు జగనన్న విద్యాకానుకలు చేరాయి. వీటిని ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకు తీసుకెళ్లి విద్యార్థులకు అందజేస్తున్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు స్కూల్ బ్యాగులతో పాటు రెండు జతల యూనిఫాం, బూట్లు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని వాడవల్లి, పెదపాలపర్రు, నరసన్నపాలెం, పెయ్యేరు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం యూనిఫాం, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.

రూ. 3.39 కోట్లతో ఇంటింటికీ కుళాయి

గుడివాడ టౌన్(నందివాడ): జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. నందివాడ మండలంలోని 10 గ్రామాలకు సంబంధించి రూ 3. 39 కోట్ల నిధులు మంజూరయ్యాయని వీటితో పైప్ లైన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. మండలంలోని పోలాసివాని పాలెం, చేదుర్తిపాడు, నూతులపాడు(జనార్ధనపురం), కుదరవల్లి, సూర్యప్రకాశరావుపేట, శ్రీనివాసపురం(నందివాడ), పానుకుమాడు, గాజులపాడు(రుద్రపాక), కుమ్మదలమాలపల్లి (తమిరిశ), గంటవానిపాలెం(తుమ్మలపల్లి)గ్రామాల్లో పైప్‌లైన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా పైపులను దిగుమతి చేస్తున్నామన్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

కైకలూరు: కౌలు రైతులు తప్పకుండా గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య అన్నారు. తామరకొల్లు రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ)పై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఏఓ దివ్య మాట్లాడుతూ పంట నమోదు చేసుకోడానికి కౌలు గుర్తింపు కార్డు అవసరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకూ రైతు భరోసా వర్తిస్తోందని చెప్పారు. సీసీఆర్‌సీ కలిగి ఉంటే పంట నష్టపరిహారం అందుతుందని తెలిపారు.
సొంత రైతు ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్, కౌలు రైతు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని రైతు భరోసా కేంద్రం వద్ద వీఏఏ, వీఆర్వోలకు ఈ నెలాఖరుకు పత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జి.రాజేంద్రప్రసాద్, మండల సలహా సంఘ అధ్యక్షుడు మీగడ వెంకట సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కూర్మ నెహెమియా, వీఆర్వో శ్రీకాంత్, వీఏఏ కాగిత జోజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నూతన సబ్జెక్టుల విధానం

ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2023–24 విద్యా సంవత్సరానికి మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానం అందుబాటులోచ్చిందని ప్రిన్సిపాల్ బి.రఘునాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 24 వరకు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలన్నారు. మేజర్ సబ్జెక్టుగా బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ జువాలజీ విభాగాల్లో 40 సీట్లు, బీకాం, బీఏ, ఎకనామిక్స్ విభాగాలు 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సందేహాల నివృత్తికి కళాశాల పీఆర్‌ఓ ఎస్‌డీవీ సత్యనారాయణ, కోఆర్డినేటర్ రమేష్‌ను 924720 34060లో సంప్రదించాలని తెలిపారు.

ప్రజలకు ఆరోగ్య భరోసా

- గుడివాడ ఏరియా ఆసుపత్రిలో రెట్టింపైన వైద్య సేవలు
- అన్ని వసతులతో సేవలు



గుడివాడలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన ఆసుపత్రి భవనం

గుడివాడ టౌన్: గత ప్రభుత్వం హయాంలో సర్కారీ వైద్యానికి జబ్బు చేస్తే నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వాసత్రులకు చికిత్స చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో మరింత మెరుగైన వసతులు, వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వాస్పత్రులు ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నాయి. దీనికి నిదర్శనం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు భారీగా పెరగడమే. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం వైద్య సేవలు రెట్టింపు అయినట్లు అక్కడి వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రికి రోజుకు సుమారు 400పైగా ఓపీ చూపించుకోవడానికి వస్తున్నారు. గత ప్రభుత్వంలో ఒక పిడియాట్రిక్(చిన్నపిల్లల వైద్యులు), గైనిక్(ప్రసూతి వైద్యులు), అనస్తీషియా(మత్తు విభాగం) వైద్యులతో పాటు డెంటల్, జనరల్ మెడిసిన్ మొత్తం ఆరుగురు వైద్యులు సేవలు అందించేవారు. ఈ నేపథ్యంలో 2018–19 వరకు ఏడాది మొత్తం 1,03,027 మందికి ఓపీలో వైద్యం అందేది. ప్రస్తుతం ఏడాదికి 1,58,019 మందికి వైద్యం అందిస్తున్నారు. అంటే ప్రస్తుతం 55 వేల మందికి అదనంగా వైద్యం అందుతోంది.

నాడు 2.. నేడు 5 ఆరోగ్య కేంద్రాలు

పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నామమాత్రంగా నడిపేవారు. ప్రస్తుతం ఐదు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యసేవలు మెరుగుపడ్డాయి. దీనిలో భాగంగా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ స్థాయి వైద్యులు నలుగురు, డీవైసీఎస్ ఒకరు, సివిల్ సర్జన్ ఒకరు, ఫిజియోథెరపిస్టులు ఇద్దరుతో పాటు అసిస్టెంట్ సివిల్ సర్జన్స్‌తో కలిపి 21 మంది వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రత్యేకంగా ఫిజియోథెరపీ, దంత, కంటి విభాగాలు

గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఫిజియోథెరపీ, దంత విభాగం, కంటి విభాగం, చెవి–గొంతు–ముక్కు విభాగాల్లో ప్రత్యేక వైద్యులను ఏర్పాటు చెయ్యడంతో పాటు పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, డెర్మటాలజీ(చర్మవ్యాధులు), ఆర్థోపెడిక్(ఎముకలు), గైనకాలజీ(మాతాశిశువిభాగం), రేడియాలజీ, అనస్తీషియా, జర్యాటిక్(60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ప్రత్యేక వైద్యం) వీరితో పాటు డీఎన్‌బీ విభాగం నుంచి రెండు పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు ఇక్కడ కేటాయించడంతో పెద్ద సంఖ్యలో వైద్యులు సేవలందిస్తున్నారు. గతంలో ఇక్కడ ఆర్థోపెడిక్ వైద్యానికి రిఫర్ చేసేవారు. ప్రస్తుతం అనేక సౌకర్యాలు ఉండటంతో ఆర్థోపెడిక్‌కు సంబంధించి ఇక్కడే వైద్యం చేస్తున్నారు. దీంతో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుతోంది. రూ.70 లక్షలు, 1.50కోట్లతో రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటుచేశారు. రూ.35 లక్షలతో లిఫ్ట్, రూ.70 లక్షలతో జర్యాటిక్ భవనం, అధునాతన వైద్య పరికరాలతో వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రారంభానికి సిద్ధంగా 100 పడకల ఆసుపత్రి

ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చొరవతో స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో 100 పడకల నూతన ఆసుపత్రి భవనం నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీనికి వెనక వైపు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉంది. గతంలో నిర్మించిన ఆసుపత్రి భవనం స్లాబులు పగిలి పెచ్చులు ఊడినా కనీసం వాటి మరమ్మతులను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం నిర్మించిన నూతన భవనం ప్రారంభమైతే గుడివాడ నియోజకవర్గానికే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అనేక మందికి సేవలందిస్తుందని వైద్యులు అంటున్నారు.



ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అధునాతన హంగులతో ఫిజియో థెరపీ విభాగం



ప్రభుత్వ ఆసుపత్రిలోని నేత్ర విభాగంలో సేవలందిస్తున్న వైద్యులు

మెరుగైన సేవలు అందుతున్నాయి



నేను నడుము నొప్పితో బాధపడుతున్నాను. గతంలో వైద్యులు మందులు ఇచ్చి పంపించేవారు. ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి ప్రత్యేక పరికరాలు ఉపయోగించి వైద్య సేవలు చేస్తున్నారు. దీంతో నాకు నడుమునొప్పి బాగా తగ్గింది. ఇక్కడ సేవలు తీసుకుంటూనే ఉన్నా. ఇంత గొప్ప వైద్యం గతంలో ఎన్నడూ చూడలేదు.

–కత్తుల అబ్రహం, రోగి

పూర్తి స్థాయిలో సేవలందిస్తున్నాం..



అన్ని విభాగాలకు వైద్యులు ఉన్నారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. కరోనా సమయంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌తో అనేక ప్రాణాలు కాపాడగలిగాం. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో వైద్యుల సేవలకు తృప్తిచెందుతున్న రోగులు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యచికిత్సకు ఆసక్తి చూపుతున్నారు. గతంకన్నా ఇప్పుడు రెట్టింపు వైద్యసేవలు అందుతున్నాయి.

–డాక్టర్ ఇందిరాదేవి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ కృష్ణా

రేపు న్యాయసేవల అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: వివిధ చట్టాలు, ప్రభుత్వ పథకాలపై న్యాయపరమైన అంశాలను ప్రజలకు తెలియజేయడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాల్లో గురువారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు గుడివాడ వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి ఆయా శాఖలు స్టాళ్ల ఏర్పాటు చెయ్యాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ద్వారా లబ్ధిదారులకు ట్రైమోటార్ సైకిళ్లు, వినికిడి పరికరాలు, ల్యాబ్‌ట్యాప్‌లు వంటి పరికరాల పంపిణీకి ఏర్పాట్లు చెయ్యాలని చెప్పారు. శానిటేషన్, తాగునీరు ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. విద్యాశాఖ ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యుత్ అంతరాయం కలుగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చెయ్యాలని కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు సమాచార శాఖ అధికారులు కృషిచెయ్యాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయమురళీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాదు, తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఎంపీడీఓ ఏవీ రమణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



రైతుల సమస్యలు తెలుపుతున్న ఎమ్మెల్యే కైలే

చిలకలపూడి(మచిలీపట్నం): పెదపారుపూడి మండలంలోని పాములపాడు, మోపర్రు గ్రామాలకు చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. కలెక్టర్ పి. రాజాబాబును ఆయన చాంబర్‌లో గురువారం కలిశారు. ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ పాములపాడు, మోపర్రు గ్రామాల్లో 120 ఎకరాల వ్యవసాయ భూములకు రెండు వైపులా ఆక్వా చెరువులు ఉన్నాయని, ప్రతి సంవత్సరం ఈ భూములు వరద ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. వరిసాగుకు అనుకూలంగా లేకపోవడంతో ఆర్థికంగా రైతులు ఇబ్బందులు పుడుతున్నారని చెప్పారు. 294 నుంచి 306 వరకు ఉన్న 12 సర్వే నెంబర్లలోని భూములను చేపల చెరువుగా మార్చుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై కలెక్టర్ రాజాబాబు సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ జేడీ, పెదపారుపూడి తహసీల్దార్ ఇరువురు కలిసి క్షేత్ర పరిశీలన చేసి ఆ ప్రాంతంలోని ప్రస్తుత పరిస్థితిపై నివేదిక ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి పనికిరాని భూమిని ఆక్వా జోన్‌లో చేర్చేందుకు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించినందుకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో రైతులకు సాగునీరు

ఇరిగేషన్ ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్



గుడ్లవల్లేరు వద్ద క్యాంపుబెల్ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ

గుడివాడరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్లో రైతులకు ఉపయోగపడేలా కాల్వలకు సాగునీటిని విడుదల చేశామని ఇరిగేషన్ ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్ అన్నారు. గుడ్లవల్లేరు మండలంలోని క్యాంప్‌బెల్ కెనాల్, పోల్‌రాజ్ కెనాల్‌ను ఎస్ఈ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఎకరం సాగుకు సన్నద్ధమయ్యేలా నీటిని విడుదల చేశామన్నారు. రైతులు సాగుకు సన్నద్ధం కావాలని కోరారు. రైతులకు సాగునీటి సరఫరాల ఇబ్బందులు ఎదురైతే ఇరిగేషన్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం అధికారులతో సాగునీటి వినియోగంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుడివాడ ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, ఏఈ రాజ్యలక్ష్మి, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన నందిగం సామేలు. ఇతని కుమారుడు పెద్ద కుమారుడు జార్జి గుడివాడలో నివసిస్తుండటంతో సామేలు ఐదు రోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. అతని ఆచూకీ తెలియకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని రోడ్డుపై ఐదురోజులుగా పడిగాపులు కాస్తున్నాడు. అతని వద్ద కుమారుడి సెల్ ఫోన్‌గానీ, అడ్రస్‌కానీ లేదు. సామాజిక వేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) విషయం తెలుసుకుని వృద్ధుడిని గుడివాడలోని వృద్ధాశ్రమానికి చేర్చారు. ఇతన్ని కుటుంబ సభ్యులు ఎవరైనా గుర్తు పడితే తనను 9885011339లో సంప్రదించాలని కోరారు.

–గుడివాడ రూరల్

అంగన్‌వాడీలతో చిన్నారుల అభ్యున్నతి



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందిస్తున్న అంగన్‌వాడీ పీడీ ఎస్ సువర్ణ



తోట్లవల్లూరు కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

అడ్డాడ(పామర్రు): అంగన్‌వాడీ కేంద్రాలతోనే చిన్నారుల అభ్యున్నతని సీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ చెప్పారు. అడ్డాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాల్లో గురువారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీడీ మాట్లాడుతూ నేటి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు పథకంలో పెట్టి అభివృద్ధి చేస్తోందన్నారు. ఇక్కడ చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన, చిన్నారులలో సృజన పెంపొందించడానికి పలు రకాల క్రీడలను ఆడిస్తున్నారన్నారు. సంపూర్ణ పోషకాహారాన్ని వారికి అందిస్తామన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

అంగన్‌వాడీలలో ఐదేళ్ల పాటు చదువు పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. వీటితో చిన్నారులు స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ, పెదమద్దాలి సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణకుమారి, విజయలక్ష్మి, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని తోట్లవల్లూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంఎస్‌కే సుజాత అన్నారు. మండల పరిధిలో ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు శివలీల, శిరీష, ఉపాధ్యాయురాలు కోకిల రాణి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావద్దు



మత్తు పదార్థాల వాడకంతో జరిగే నష్టాలపై పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కైకలూరు: యువత మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని 'నీ తోడు – మానసిక వికాసకేంద్రం' డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్, విజయవాడ కోఆర్డినేటర్ టి.లీలావతి సూచించారు. ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకంతో కలిగే పరిణామాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లీలావతి మాట్లాడుతూ యువత గంజాయి, సిగరెట్, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలు వినియోగించి విలువైన జీవితాన్ని కోల్పోతోన్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహనరావు మాట్లాడుతూ మత్తుతో కలిగే నష్టాలు తెలుసుకోవచ్చన్నారు. అనంతరం 'ఓ యువతా.. జాగ్రత్త.. మత్తు పదార్థాలు నీ దగ్గరకొస్తే తప్పదు నీ మరణం' అంటూ నినాదాలు చేసి కరపత్రాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు

పామర్రు(తోట్లవల్లూరు): పాములంక గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షల ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 60 ఏళ్ల దాటిన అవ్వా తాతలకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు, మందులను అందజేశారు. ఉచితంగా ఆపరేషన్ల నిమిత్తం ఆసుపత్రికి రిఫర్ చేశారు ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు చేశారు. 60 మందికి పైగా వృద్ధులు పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ శీలం రమేష్, ఎంపీహెచ్ఈవో శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ కొడాలి మమతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాక్ బృందం పరిశీలన

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం ప్రారంభమైన నాక్ అక్రిడేషన్ మూడవ బృందం పరిశీలన గురువారంతో ముగిసింది. చైర్మన్ సురేంద్ర ప్రతాప్ సింగ్(బిహార్), కో–ఆర్డినేటర్ స్వప్న శ్యామ్యూల్ (మహారాష్ట్ర), మెంబరు ఎస్ఎంకే కాద్రి (ఢిల్లీ)లు కళాశాలలో అన్ని శాఖల పనితీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల నుంచి వసతులపై సమాచారం తీసుకున్నారు. అన్ని పరిశీలించిన తర్వాత సంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి చెప్పారు. అనంతరం నాక్ బృందం రిపోర్టును ప్రిన్సిపాల్‌కు అందించారు.

నాడు - నేడుతో పాఠశాలలకు మహర్దశ

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని ఎంపీపీ అడవి కృష్ణ తెలిపారు. మండల రిసోర్సు పర్సన్ (ఎమ్మార్సీ) భవనంలో గురువారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో నాడు – నేడు రెండో విడత పనులపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో రెండో విడతలో 32 పాఠశాలలు, 11 అంగన్‌వాడీ కేంద్రాల పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ సాధిక్ పాషా, ఎంఈఓ–1 డి.రామారావు, ఎంఈఓ–2 వి.శ్రీనివాసరావు, ఎంపీపీ అడవి కృష్ణ వైస్ ఎంపీపీ ఎండీ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

మొవ్వపాలెం(మొవ్వ): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉన్నతికి దాతలు చేయూతనిస్తున్నారని మొవ్వపాలెం సర్పంచ్ చలమలశెట్టి శివకుమారి అన్నారు. మొవ్వపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తూమేటి రంగబాబు, వైస్ చైర్మన్ బాదర్ల కామాక్షి రూ.3 వేల విలువైన నోటు పుస్తకాలను వితరణగా అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రవీంద్రబాబు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పాగోలు రమేష్‌బాబు, వి.శివకుమార్, సీఆర్‌పీ శ్రీమన్నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యూహెచ్‌సీల్లో మెరుగైన సేవలు

గుడివాడ టౌన్: అర్బన్ హెల్త్ సెంటర్లలో మెరుగైన వైద్యసేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని పల్నాడు జిల్లా నాణ్యతా ప్రమాణాల అధికారి డాక్టర్ ఎన్.రామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక బాపూజీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం వసతులు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. జాతీయ వైద్యవిధానానికి అనుగుణంగా ఇక్కడ వసతులు ఏ మేరకు ఉన్నాయి లేకపోతే ఏ విధంగా సరిదిద్దుకోవాలి అనే అంశాలను పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. ఇక్కడ వసతులపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడ అవసరాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైద్య వ్యర్థాలను రీసైక్లింగ్‌కు తరలించడానికి సేఫ్ ఎన్విరాన్‌మెంట్ అనే సంస్థతో అవగాహన కుదుర్చుకోవడంతో వాటిని సురక్షితంగా అక్కడికి తరలిస్తామన్నారు. వీటన్నింటిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పింస్తామని దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా క్వాలిటీ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

'ఉద్యాన' పథకాలను వినియోగించుకోండి

పామర్రు(తోట్లవల్లూరు): ఉద్యానశాఖలో ఉన్న పథకాలను రైతులు వినియోగించుకోవాలని తోట్లవల్లూరు మండల ఉద్యాన శాఖ అధికారి చందు జోసెఫ్ సుందరం అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీలను అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. ముఖ్యంగా బొప్పాయి తోటలకు ఎకరానికి రూ.12వేలు రాయితీ ఇస్తోందని, మామిడి పంటకు రూ.5,350, జామ పంటకు రూ.11,730, నిమ్మకు రూ.6,402, టిష్యూ కల్చర్ అరటికి రూ.16,394 ఇస్తోందని తెలిపారు. ఆయిల్‌పాం సాగుకు నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో రాయితీలు ఉన్నాయని తెలిపారు. కొబ్బరి సాగుకు పొలంలోగానీ, గట్లపైగానీ కనీసం 10 మొక్కలు వేసుకుంటే మొక్కకి రూ.40 చొప్పున కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా రాయితీ ఇస్తారని తెలిపారు. రాయితీ కావాల్సిన వారు ఆర్‌బీకేలో పేర్ల నమోదు చేయించుకోవాలని తెలిపారు.

నేడు చెరువు కౌలు వేలం

ముదినేపల్లి రూరల్ : ముదినేపల్లి మండలం వడాలి జగన్నాథస్వామి ఆలయానికి చెందిన చెరువు కౌలు వేలం పాట శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ ఆలయానికి ముదినేపల్లి మండలం చేవూరులో 15.69 ఎకరాల చేపల చెరువు ఉన్నట్టు చెప్పారు. దీనిలో మూడేళ్ల పాటు చేపలు పెంచుకొని పట్టుబడి కోసం కౌలుకు ఇచ్చేందుకు చేవూరు పంచాయతీ కార్యాలయం వద్ద వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి పాటల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

ఉపాధి హామీ పనులు

మండవల్లి: మండలంలోని గన్నవరం గ్రామంలో రూ.1.60 లక్షల అంచనా విలువతో గురువారం పంట బోదె పనులను 69 మంది ఉపాధి కూలీలు నిర్వహించినట్టు ఇన్‌చార్జి ఏపీఓ ఎన్.నవీన్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.